కథానిక

# ధర్మం

మల్లాది వెంకట కృష్ణమూర్తి

నాకు దయానంద్ మీద ఒక స్థిరాభిప్రాయం ఉంది. చూస్తూ చూస్తూ అర్ధరూపాయి ముష్టివాడికి దానం చేసే జాలి గుండెలేదు వాడికి. ఒక వాడిలోనే కాదు. నిజానికి నా లోనూ, నాకు తెలిసిన అనేక మందిలోనూ లేదా మంచితనం.

కాని దయానంద్ నేను చూసేలా జేబులోంచి అర్ధరూపాయి బిళ్ళ తీసి చూపు సరిగా అనని ఆ ముసలి బిచ్చగాడిబొచ్చెలో ఠంగు మనేలా వెయ్యడం నన్ను అమితంగా ఆశ్చర్య పరిచింది. సైనికుల మధ్య రాజులా, అయిదు, రెండు పైసలనాణాల మధ్య అదిఅందంగా అమరి ఉంటుందను కున్నాను.

ఎందుకింత ధర్మ బుద్ధి కలిగిందీ రోజు అని అడగ లేదు. నేను మౌనంగావాడి వెనకే నడిచాను పార్కుదాకా. వాడు ప్రపంచంలోని అనేక సంగతుల గురించి మాట్లాడాడు అనర్గళంగా, కాని అర్ధరూపాయి ఎందుకు దానంచేశాడో చెప్పనే లేదు.

పార్కులో నేనే కొన్నాను వేరు సెనక్కాయలు. అరగంటదాకా రోజులా కూర్చున్నాం పార్కులో వేరు సెనక్కాయలు తింటూ. తర్వాత లేచి నెమ్మదిగా నడవసాగాం. అప్పుడైనా చెప్తాడేమోనను కున్నాను, కాని వాడు ఆ విషయమే ఎత్తలేదు. అడగాలనిపించినా నేను అడగలేదు.

తిరిగి వస్తుంటే, అదే దారి కాబట్టి, వెల్కమ్ హోటల్ దగ్గర ఆ ముష్టివాడు తారస పడ్డాడు. వాడివైపు చూశాను. నెమ్మదిగా బెక్కుతూ ఏడుస్తున్నాడు. వాడి కళ్ళల్లోంచి నీళ్ళు వస్తున్నాయి. అంత పెద్దవాడు ఏడవటం నన్ను కించిత్ ఆశ్చర్య పరిచింది. ఆ ముష్టి వాడి బొచ్చె పూర్తిగా ఖాళీ అయింది. రాజు వచ్చి సైనికులని యుద్ధం విరమించ మంటే ఖాళీ అయిన యుద్ధ రంగంలా.

“ముష్టి వాడైతే మాత్రం ? కడుపు నిండా తిని సత్తు అర్ధ రూపాయి ఇచ్చేది? ఆ మాత్రం చూసుకోనక్కర్లా ? అయినా ఏ తలకు మాసిన వెధవంట సత్తు అర్ధ రూపాయలు దానం చేసేది?” హోటల్ కాషియర్ అరుపులు వద్దనుకున్నా మా చెవిన పడ్డాయి.

దయానంద్, దయానంద్ ప్రక్కనే నేను నిశ్శబ్దంగా నడిచాం, ఆ ముష్టివాడి ముందు నుంచి నేల చూపులు చూస్తూ.

***